
# సంత

ఎం. రామకోటి



**ఉన్న ఊరు కన్న తల్లి.**
**మా కేరింతలూ, తువ్వలూ, తుళ్ళింతలూ అన్నీ ఆ ఒడిలోనే!**
**ఆ బడిలోనే మా చదువు సంధ్యలూ, ఆటలు, తగువులాటలు, తన్నులాటలు, పాటలు... అన్నీ అక్కడే**
**అక్కడే మా బాల్యం కలలా కరిగిపోయింది.**
**మేం చదువుకున్న హైస్కూలు నూరేళ్ళ పండగ చేసుకుంటోంది. పాత విద్యార్థులందరికీ ఉత్తరాలు పంపేరు. అందుబాటులో వున్నవారికి కబురంపేరు.**
**కబురందుకుని ఉప్పొంగిపోయేం. మళ్ళీ యిన్నేళ్ళకి యిన్నాళ్ళకి మా వూళ్లో ఏరూ, కొండాకోనా, పుంతలో మునిలమ్మా, తోవలో తలుపులమ్మను చూడొచ్చని తహతహలాడేం. మల్బారయ్యరు గారి స్వామినాథన్, పాతదివాను గారి,**
**రెడ్డిపంతులూ, చంద్రం, తురకపేట కరీం రామనాథం అందరం కలుసుకున్నాం. అయ్యేయస్సులూ, అయిపీయస్సులుగా లాయర్లూ, జడ్జీలూ, పారిశ్రామిక వేత్తలుగా వివిధ రంగాలలో రాణించేం. దేశ విదేశాలు యెన్ని తిరిగొచ్చినా కన్న తల్లినీ వున్న ఊరుని చూడాలని ఉవ్విళ్ళూరుతూ కలుసుకున్నాం.**
**అందరం వయసు మీరుతున్న వాళ్ళమే! పొద్దువాలుతోంది జీవితంలో.**

కబుర్లాడుకున్నాం. కష్టసుఖాలు కలబోసుకున్నాం. యాతనలూ ఆరాటాలూ, ఆంతర్యాలూ, అవమానాలూ, గౌరవసత్కారాలూ ఏకరవు పెట్టుకున్నాం. కౌగలించుకున్నాం. పండిన గుండెల పన్నీటి చినుకులు మా కంట కురిసిన ఆనందబాష్పాలు. మా చొక్కాలు. తడిపేసుకున్నాం. అభిమానాలూ ఆప్యాయతలూ పంచుకున్నాం.

మా ఊరి మినిస్టరు రాజుగారికి మిట్ట మధ్యాహ్నం దాకా తీరుబడిలేదట. ఫంక్షను అప్పుడు గాని మొదలవదట. స్కూల్లో దేవుళ్ళాడాలి.

ఎవరున్న యిళ్ళూ వాకిళ్ళూ, వీధులూ, యింకా వున్నవాళ్ళని పలకరించుకోవాలని, ఓమారు వేరువేరుదార్లు పట్టేం.

హైస్కూలికి దగ్గరలోనే వుండేది మా యిల్లు. ముందు పెద్దపెద్దరుగులుండేవి. షాపులకోసం అక్కడ కొట్టు కట్టేసేరు. ముందు పోల్చుకోలేకపోయేను. ఎక్కడున్నానని కంగారు పడ్డాను.

మా నాన్న మా చిన్నప్పుడే పోయేరు. నడివయసు మళ్ళిపోయిన మా అమ్మా, మా వదినా, అన్నయ్యా వుండేవాళ్ళం. అప్పటికి ఏడెనిమిదేళ్ళ వాడిని. మా చెల్లి జాహ్నవి. అయిదారేళ్ళ బుట్టబొమ్మ. సబ్బు బొమ్మలా వుండేది. పట్టుకుందామంటే దొరికేది కాదు. ఒప్పులకుప్పలూ వానా వానా వల్లప్పలూ తోటి పిల్లలతో ఆడుకుంటూ పాడుకుంటూ బొంగరంలా గిరగిర తిరుగుతూ ఒక్కమారు కూర్చునేది. దాని పరికిణీ బుంగదేరేది.

మేం కడగొట్టు వాళ్ళం. మా వదిన కాదు – మా వదినమ్మకి మా జాహ్నవి బడుచు కాదు. కన్న కూతురు. మా వదినేం చదుకుందో తెలీదుకానీ యూనివర్సిటీలో చదివింది. అక్కడే మా అన్నయ్యతో జత గూడింది.

పెద్దపండగ రోజుల్లో, మునివాకిల్లో కళ్లాబు

జల్లి, తుడిచి చదునుచేసి రంగురంగుల ముగ్గులే సేది. రంగులన్నీ కాలితో చెదరగొట్టే వాణ్ణి. మా చెల్లి జాహ్నవైతే ముగ్గులు మీద చిందులేసేది. కోపం తెచ్చుకునేదికాదు. నవ్వుకుంటూ మళ్ళీ ముగ్గులు దిద్దేది. ఏనాడూ మమ్మల్ని ఒక్కమాటనేది కాదు. కథలూ, కబుర్లు చెప్పి బువ్వతినిపించేది. చదువు చెప్పి హోం వర్కు చేయించేది.

మా వూళ్లో హరిదాసు జియ్యరుండేవాడు. పంగనామాలు, పట్టుపంచా, తలపై గుడ్డ చుట్టూ దాని మీద అక్షయపాత్ర, చిడతలు - ఇవీ ఆ జియ్యరు ముస్తాబు. పాటలూ, పదాలు పాడు కుంటూ, కోడికన్న ముందులేచి యింటింటికీ తిరిగే వాడు. స్వచ్ఛంగా మాట్లాడేవాడు. డొక్కశుద్ధి వున్న వాడు. అక్కడికక్కడే పదాలల్లేవాడు. పాడుతూ చిడతలు వేస్తూ ఆడేవాడు. పప్పు, వుప్పూ, బియ్యం పొట్లాలు కట్టి వుంచేది మా వదిన. ఆకు కూరలు. ముందుగానే కట్టగట్టి వుంచేది. అక్షయ పాత్రలో అగడకుండానే వేసేది.

''కృష్ణార్పణమస్తూ'' అనే వాడు.

ఓ మారు అలవాటుగా కొంటె చేష్టలతో మా వదిన వేసే ముగ్గుల్ని తొక్కి తందానాలాడుతున్నా. మా అడుగులు ఆనవాళ్ళు చూసి-

''ఆ రంగవల్లిక మీద అడుగులెవరివీ'' అన్నాడు.

''కౌసల్య నట్టింట రామయ్య చిట్టడుగు'' అంది మా వదిన.

''నందునీ ముంగిటా నల్లగాల్లని అడుగు'' అన్నాడు జియ్యరు.

నేనేం తీసిపోయేను చూడు నా తడాకా అని

''బలిరాజు కొలువులో అడగబోయిన అడుగు'' అంటూ మరో పాదం చెప్పింది మా వదిన.

ఇంక ఏం చెప్పాలో తోచలేదు జియ్యరుకి.

మా చెల్లి చిందులేసిన బుల్లిబుల్లి అడుగులు చూసి-

''అడుగడుగు యీ అడుగు ఎవరిదో అడుగు'' అంటూ మా చెల్లి వేపు చూస్తున్నట్టు మా వదినకో సమస్య యిచ్చేడు.

'మా యింటి చిన్నారి రాయించ చిట్టడుగు'' అని మా జాహ్నవి చిల్లులు బుగ్గలు చిదిమి ముద్దెట్టు కుంది మా వదినమ్మ.

ముగ్గులు లేవు. మురిపాలు లేవు. మా వదిన లేదు. అందరూ వెళ్ళిపోయేరు. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. చేతురుమాలుతో ఒత్తుకున్నాను.

అవన్నీ జ్ఞాపకానికొచ్చిన - 'తమిదీయని తలు పులు' - అవి తొలకరి జల్లులు. తేనెల తుంపరలు. మహాకావ్యాలుగా నా మనసంతా నిండుకు న్నాయి. నా గుండె పండింది. కోయిలగూడు అయింది.

మా వదినా, హరిదాసూ యిద్దరికిద్దరే సాటి. వాగ్గేయకారులు.

పన్నెండవుతోంది. సమయానికి అందరం తిరిగి చేరుకున్నాం. అనుభవాలు నెమరేసుకున్నాం.

తతంగం అయిపోయింది. జ్ఞాపికలూ, శాలు వాలూ, సన్మానాలు అన్నీ జరిగిపోయేయి. అన్నీ అందుకున్నాం. ఇవన్నీ మాకు కొత్తేం కాదు. ఉన్న ఊళ్ళో, చదువుకున్న స్కూల్లో అందుకోడం అరు దైన అనుభవం.

''తవఁరంతా... ఏం చేసేవారూ'' అంటూ భోజనాల దగ్గర మినిస్టరు రాజుగారు లౌక్యంగా ఆరాలు తీసేరు.

''అబ్బో అబ్బో!'' అంటూ ఆప్యాయంగాలా వుంది మా జబ్బలు చరిచేరు. ఆయనకన్నా మేమందరం పెద్దవాళ్ళమని ఆయన కనిపించలేదు.

అది వారి సాంప్రదాయం - వారి తరహా.

పొద్దువాల్తోంది. ఏనుగుకొండ ఎర్రబారు తోంది. బోడి మెట్ట ఏవో వూసులాడుతోంది.

''ఏఁవ్రా మమ్మల్ని చూడాలనిపించలేదా'' అన్నట్టు పుంతలో ముసిలమ్మా, తోవలో తలుపు లమ్మా'' మా చెవిలో చెబుతున్నట్టునిపించింది.

''ఏం చెప్పబోతావో... వినాలని లేదా... మీ ఖర్మ'' అని విసుక్కున్నట్టునిపించింది. హెచ్చరిస్తు న్నట్టనిపించింది.

''ఒరే వూరంతా చుట్టొద్దాంరా'' అన్నాడు మా స్వామినాథన్.

నూటికి నూరుపాళ్ళు తెలుగువాడు. మాతో బాటే పెరిగి పెద్దవాడయ్యేడు అక్కడే. మా ఊరన్నా, తెలుగున్నా వాడికో మమతాను బంధం వుంది. ఆ ఏట్లో మాతో బాటే యీతలు కొట్టేడు.

''మంచి మాటన్నావురా... పద పద..'' అని బయల్దేరేం.

కోనేటి గట్టూ, తురకపేట, ఏనుగుతోటా, ఎదు రుగా మేం ఆడుకున్న ప్లే గ్రౌండు, ఘోసాస్పి టలూ దాటి కొత్తపేట చేరేం.

కోమాకుల వారిల్లూ, ఖాదీ భండారం మళ్ళీ చూడాలనిపించింది.

తెల్లవాళ్ళ మీద తిరుగుబాటు ఎలా చెయ్యాలి. ఏం చెయ్యాలని వాళ్ళ పనెలా బట్టాలి అని రంగన్న తాతగారూ, ఆచార్లు గారూ అలీషాగారూ, శాస్త్రి కవిగారూ అంతా తలమునకలై ఆలోచించే మంత నాలు, పన్నాగాలూ అక్కడే రూపుదిద్దుకునేవి. మొలలో 'యిప్పసారకాయి' దోపుకుంటూ, మధ్యలో జొరబడే వాడు మల్లుదొర కేడీపేట గాం మల్లుదొర - వాడు అల్లూరి సీతారామరాజు గారి తిరుగుబాటులో పాలు పంచుకున్నవాడు. ''వచ్చినాం బాబూ'' అంటూ వచ్చేవాడు. తరు వాత ఎం.పి కూడా అయ్యేడు ఆ కొండదొర.

గజాల తలుపులు మూసి వున్నాయి. దుమ్మూ, ధూళీ, చెదలూ పాముల పుట్టలూ అన్నీ ఆ యింటిని దెయ్యాల కొంప - పీడపట్టిన లోగిలిగా మార్చేసేయి.

కోమాకుల కుటుంబం - మాకొద్దంటే మా కొద్దని వదల్చుకుని పటాపంచలై పోయేరు. ఖాదీ భండారం ఆ వీధి చివర దివాణంలోకి తరలిపో యింది. వారందరూ ఖద్దరులో మునిగి తేల్తు న్నారు. రాజకీయాల్లో యివాళ రాణిస్తున్నారు. ఊరుని మళ్ళీ వాళ్ళే ఏలుతున్నారు ప్రజా ప్రతిని ధుల అవతారాలెత్తేరు.

ఎవరికీ అక్కర్లేని యిల్లై పోయింది. ఇది చూడ్డానికా యింత దూరం వచ్చేం అనుకుని మాలో మేమే కుమిలిపోయేం.

దీపాలు వెలుగుతున్నాయి. ఆ రాత్రికి దాట్ల వారింటిలో మకాం ఏర్పాటుచేసేరు. కలకబారిన మనసులతో నిద్రపోయేం.

తెల్లారింది. తయారయ్యేం. రైల్వేస్టేషనుకెదు రుగా మా స్వామినాథన్ బంధువులు మల్బారు కాఫీ క్లబ్బు నడుపుతున్నారు.

ఆనాటి బెంచీలు బల్లలూ లేవు. ఏ.సీ. రెస్టారెం టైపోయింది. నెక్టైలు కట్టుకుని టేబిల్ దగ్గర కొచ్చి ఆర్డరు తీసుకుంటున్నారు వైటర్లు.

''ఏఁవ్రా యిది.. ఆనాటి క్లబ్బేనా యిది''



అన్నాం.

''ఏమోరా నాకూ ఆశ్చర్యంగానే వుంది. నేనూ యిదే మొదటిసారి రావడం'' అని తెల్లబోయేడు స్వామినాథన్.

ఆ హోటలు వాళ్ళు స్వామినాథన్ గుర్తించినట్టు లేదు.

కాఫీ టిఫిన్లూ అయిం తరవాత బయటికొచ్చి ఎటు వెళ్ళాలా అని ఆలోచనలో పడ్డాం.

''పక్కనే గదరా మన గాంధీ మైదానం'' అన్నారు కరీం, స్వామినాథన్ యిద్దరూ ఒకేసారి. సరదా పడ్డాం.

''అవున్రా... మా బాగా జ్ఞాపకం చేసేరు'' అనుకుంటూ మైదానం వేపు బయల్దేరేం. ఉబలాటం ఎక్కువైంది.

ప్రతి శ్రావణ మాసంలోనూ, ఊళ్ళో పెద్దలూ, తురకపేట సాయిబులూ మసీదు అబ్దుల్‌హలీం గారూ యింకా ఎందరెందరో తరలి వచ్చేవారు. గుమిగూడే వారు. మూడంచుల ఎర్రగచ్చు. గుండ్రని చపటా వుండేది. దాని మీద రాట. దాని చివర రాట్నం వున్న మువ్వన్నెల జెండా ఎగిరేది. ప్రతి శ్రావణంలోనూ కొత్త జెండా ఎగరేసేవారు.

''జైహింద్'' అంటూ ముక్త కంఠంతో ఎలుగెత్తి గౌరవ వందనం చేసే వారు.

అదొక జన సముద్రం. అదొక వేదస్వరం. ఊరంతా మార్మోగేది.

ఆడవాళ్ళంతా రాట కుదురుకి పసుపు కుంకాలతో పూజలు చేసేవారు.

అందరూ తలో చెయ్యా వేసి సామూహికంగా సహపంక్తి భోజనాలు చేసేవారు.

పిఠాపురం సంత నడిపే పాములపర్తి పెద్దయ్య ఉడతాభక్తిగా తను కూడా కొంత సమర్పించుకునే వాడు.

''ఒరే అబ్బాయిలూ... యీ మైదానం అంటే ఏఁవనుకుంటున్నారు? మన అమ్మ, దేశమాత భారతమ్మ పుట్టిల్లురా. ఇది మన దేశం. ఇది మన స్వరాజ్యం కావాలి. సురాజ్యంగా వెలగాలి'' అంటూ మమ్మల్నిందరినీ చేరదీసి వుత్తేజ పరిచే వారు.

ఆచార్లుగారూ, రంగన్న తాతగారూ, అబ్దుల్ హలీంగారూ మా కరీం తాతగారూ అందరూ మమ్మల్ని చేరదీసి బుజ్జగిస్తూ మరీమరీ చెప్పేవారు. అక్కడికి చెప్పులతో వెళ్ళడానికి జంకేవాళ్ళం.

తీపితీపి కబుర్లూ, అంతులేని తాత్సారం, తెల్లవాళ్ళ పన్నాగాలకి విసుగెత్తి పోయినట్టున్నారు గాంధీగారూ – ఆ పన్నాగాలకి అంతు చూడాలనుకున్నారు.

''తాడో పేడో తేల్చుకుందాం.. డూ ఆర్ డై'' అంటూ పిలుపిచ్చేరు.

ఆ ఒక్కమాట ఆనోటా ఆనోటా దేశం అంతా అల్లుకుపోయింది. దావానలంగా కార్చిచ్చై ఊరంతా భగ్గుమంది. అందరిగుండెలూ రగులుకుంటున్నాయి. నివురు గప్పిన నిప్పులా రువరువలాడుతున్నాయి.

తెల్లవాళ్ళ తైనాతీలు యీ పిలుపు ముందే పసిగట్టునట్టుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా డప్పుల సుబ్బా రావుండే వాడు. గుర్రం మీదొచ్చేవాడు. డప్పులు వాయించి మీటింగులు చెల్లా చెదురు చేసే వాడు.

ముందురోజే గాంధీ మైదానంలో జెండా దించేసి చీలిక పేలికలుచేసి పీకి పాకంబెట్టి బూటు కింద కసిగా తొక్కి, తెళ్ళవాళ్ళ జెండా ఎగరేసేడు.

ఊరట్టుడికి పోయింది. ముందు తెల్లబోయేరందరూ. పాయలు పాయలుగా అన్ని మూలల నుండీ బయల్దేరి మైదానంలో జనసముద్రం అయిపోయేరు. ఒంట్లో బాగులేక రంగన్న తాతగారు రాలేక పోయేరు.

ఆచార్లు గారు కొత్త జెండా చేత బుచ్చుకుని యిల్లాలితో తెల్లదొరల జెండాని దించి, మన జెండా ఎగరెయ్యబోయేరు.




గుంటనక్కలా ఎక్కడనక్కి వున్నాడో, రివ్వున గుర్రం మీదొచ్చేడు. ముందుకాళ్ళెత్తించి డెక్కలతో ఆచార్లు గారి గుండెల మీద తన్నించి తిరగదోసేసేడు. ఆడ మనిషినైనా చూడకుండా ఆ యిల్లాల్ని కూడా తిరగదన్నించేడు. పడదోసి గుర్రంతో తొక్కించి సంకెళ్ళు వేసి తన గుర్రం జీనుకు తగిలించి యిద్దరినీ యీడ్చుకు పోయేడు.

తురకపేట జనం కోపంతో మండిపోయి కదలకుండా గుర్రాన్ని చుట్టుముట్టేరు. రక్తాలొచ్చినట్టు కమ్చీతో వాళ్ళని చిదకబాది తప్పించుకుపోయేడు.

అది క్విట్ ఇండియా ఉద్యమం అని మాకు తరువాత తెలిసింది. ''మన గాంధీగారు ఎదురు తిరిగేరు. తెల్లదొరలెన్నాళ్ళుండగలరింక. మన స్వేచ్ఛ – స్వతంత్రం యింకెంతో దూరం లేదు. అమ్మకి పొద్దులు. భారతమ్మకి పురిటి నొప్పులు... కొత్త జీవితం మొదలవుతుంది. భయం లేని మనుగడ. స్వేచ్ఛ – స్వతంత్రం కవల పిల్లల్ని కంటుంది. తలెత్తుకు తిరిగే పరువైన బతుకు... అదిగో అదిగో'' అంటూ నిబ్బరం చెప్పేవారు అందరూ.

అన్నీ తల్చుకుంటూ గాంధీ మైదానం చేరుకున్నాం. రాటొక్కటే వుంది. జెండా లేదు. రాట నిల బెట్టిన ఎర్రదిమ్మ పెచ్చులూడిపోతోంది. ఎద్దుల్నీ, గేదెల్నీ పలుపు తాళ్ళతో ఆ రాటకి కట్టేసేరు. అవి గానుగెద్దుల్లా చుట్టూ తిరుగుతున్నాయి.

పిఠాపురం పశువుల సంత మావూరికి మార్చేసేడు పెద్దయ్య. వాళ్ళ సంతతే యీ సంత నడిపిస్తున్నారు. మనవలూ, మునిమనవులూ అంతా పెద్దయ్యలే! మైదాన్ని ఆక్రమించుకున్నారు.

ఎద్దులూ, గేదెలూ మందలు మందలుగా తిరుగుతున్నాయి. మేట్లు మేట్లు గడ్డి మేస్తున్నాయి. గొర్రెలు అమాయకంగా చూస్తున్నాయి.

బేరసారాలు సాగిపోతున్నాయి. వేలం పాటలు మొదలయ్యేయి ''ఈ మంద నాదంటే నాది'' అని పాటదార్లు చెరో పక్కా విడిపోయేరు. ఎదురెదురగా తైనాతీల దన్నుతో యిరుపక్షాలూ తొడలు చరుచుకుంటున్నారు. చేపాటి కర్రలు పిడికిళ్ళు బిగించి తలలు పగలు గొట్టుకోడానికి తలబడుతున్నారు. ఎవరి మంద వారు తోలుకు పోవడానికి సిద్ధపడుతున్నారు.

ఆ పశువులకేం బోధ పడడం లేదు. గడ్డి మేసి నెమర వేసుకుంటున్నాయి.

మలమూత్రాల్ని డెక్కలతోకుమ్మి మైదానాన్ని బురద చేస్తున్నాయి. రొచ్చుతో వూబిలా మార్చేసేయి.

పశువులూ వేలం పాటదార్లూ ఒకేలాగ అరుపులూ, గోల గగ్గోలతో యుద్ధరంగంగా మార్చేసేరు. కేకలూ అరుపులు రణగొణ ధ్వనిలో ఏ మాటా వినబడడం లేదు.

తల్లడిల్లిపోయేం. చీవాట్లు పెడుతున్నాం. తిట్టిన తిట్టు తిట్టకుండా గొంతుచించుకున్నాం. ఆ రవ్వా రొష్టులో మా మాటలు అణగారిపోయేయి.

ఎవరూ వినిపించుకోలేదు. దగ్గరికెళ్ళి బుద్ధి చెబుతాం'మనుకున్నా, ఊబిలో కూరుకుపోతాం అని ముందుకి సాగలేక పోయేం.

ఆ రొచ్చు కంపు మా ముక్కుపుటాల్ని పగల గొడుతున్నాయి. గుండె పగిలి బావురుమన్నాం. మా ఏడుపు వినబడలేదు. మా కన్నీళ్ళు ఆ రొచ్చులో యింకిపోయేయి.

అమ్మ పుట్టిల్లు యిదా అని మాలో మేం వాపోయేం.

ఈ కథలు చెప్పడానికేనా అమ్మవారు ''వినక పోతే మీ ఖర్మ'' అని చెవిలో గూడు కట్టుకుని మరీ చెప్పబోయారు – కొండలు గుంభనంగా ఏదో చెప్పబోయేయి. మేం వినలేక పోయేం.

అందరూ అన్నీ ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నాయి. ఏటి నురుగులు పకపకా నవ్వుతున్నాయి. అది పారుతోనే వుంది సముద్రంలో – జన సముద్రంలో లీనమై పోవాలని పరుగులెడుతోంది.

అన్నీ వెక్కిరిస్తున్నట్టునిపించింది.

లోకం వెక్కిరిస్తోంది.

గాంధీ మైదానం వూబై పోయింది. పశువుల సంతై పోయింది.

రొచ్చుకంపు కొడుతోంది. పురిటి కంపు కొడుతోంది.

కంపుకొడుతోంది.

★


ఎం.రామకోటి

**92466 71784, 96032 75885**


## రుక్మానీ కా హవాథ్ : ఓ కమామీషు

ఎక్కింది రాంబిల్లి బస్సు
నూకాంబికా సర్వీసు
బయల్దేరింది డొల్ల పేటకి
వెళ్ళమన్నది రొబ్బిసోములు
వెళ్లాల్సింది కరీం సాయిబు దగ్గరికి
పొద్దునే ఫోంచేసి
ఎందుకంటే ఓ చిన్న కథ
ఏమయిందంటే పెద్ద కథ

అచ్చినాయుడుకి రుక్మానీ కా హవాథ్ కావాల్ట
అది ఓ రకం పుస్తకంట
చదువుకుంటుంటే గొప్ప హాయిట
ఉత్తరాదిని ఎందరో చదూతుంటార్ట
భాగ్యం సౌఖ్యం ఆనందమూట
అది కరీంభాయి దగ్గర దొరకచ్చుట
పదో పది హేనో అవ్వొచ్చుట
నేనెళ్ళి దాన్ని పట్టుక రావాల్ట
అందుకని డొల్లపేట ప్రయాణం

జంగిపుట్టి దాటింది డొంకవలస వెళ్లింది
చిలపర్తి పక్కనించి బొజ్జంగి ఏరుదాటి
అలిగిరి మీదుగా కొండెక్కి
అవతల డొల్లపేట చేరింది చీకటికి

చింతచెట్టు నీడలో
కరీం సాయిబు చెప్పేడు
ఆ పుస్తకం పేరే వినలేదుట
నా దగ్గరెలా వుంటుందన్నాడు
కళ్ళద్దాల అనుమానంతో
అయినా నీకెందుకన్నాడు

నేనేమీ వినలా అస్సలు వినలా
జబావెలా చెప్పగలను
కరీం భాయి కూతురు
కిరోసిన్ దీపం కాంతిలో
తళతళగా నచ్చింది
ఎంతో బాగుంది చూడగానే తబ్బిబ్బు
మెత్తటి పుస్తకంలా వుంది

పేరు ఫరీదా ట
గ్లాసుడు టీ యిచ్చింది
అవీ ఇవీ అడిగాడాయన
ఏవో ఏవో చెప్పేన్నేను
టూకీగా చెప్తా
అక్కడే ఉండిపోయా సంతోషంగా
ఫరీదాతో పెళ్లి సరదాగా
చింతచెట్టు కెదురుగా
కమ్మలపాక ముచ్చటగా
ముగ్గురు కొడుకులూ నలుగురు కూతుళ్ళూ
హాయిగా
ముసలి కూడా అయిపొయ్యా

మీ కెవరికేనా ఎప్పుడేనా ఎక్కడేనా
రుక్మానీ కా హవాథ్ దొరికితే
లొట్టిపాడు అచ్చి నాయుడుకందజేసి
బుట్టెడు పుణ్యం కట్టుకోండి
సంతోషం సౌభాగ్యం ఆనందం మనదీ
పుస్తకం అచ్చినాయుడిదీ అని
తప్పుగానో ఒప్పుగానో అనుకుందాం
అదండీ కమామీషు
యింతా విని రొబ్బిసోములెవడు సాయిబూ
అని మాత్రం అడక్కండి
యిన్ని నిజాలూ నిలబడి నిలదీస్తున్నప్పుడు
కథలెలా పుట్టుకొస్తాయ్?

–త్రిపుర